## క్లుప్తంగా

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



**చేజర్ల:** మండలంలోని ఆదూరుపల్లి, కొలపనాయుడుపల్లి, నెర్నూరు గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచలనరసయ్య, కృష్ణయ్య, కొండయ్య, జాహ్నవి, భాగ్యమ్మ, కిషోర్, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

### వసతి గృహాలకు నిధుల మంజూరుకు వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**ఉదయగిరి:** రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం కలిశారు. ఉదయగిరి నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన ఆరు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. వసతి గృహాల్లో 342 మంది విద్యార్థులు ఉన్నారని, కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. కొన్ని వసతి గృహాలు వర్షం పడితే ఉరుస్తున్నాయని, శ్లాబుల పైపెచ్చులు ఊడి కింద పడుతున్నందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ఇప్పటికే ఆయా వసతి గృహాల మరమ్మతుల కోసం రూ.78 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

### ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు



**ఉదయగిరి:** వరికుంటపాడు మండలం గణేశ్వరపురంలోని పొలాల్లో ఎల్‌టీ విద్యుత్‌లైన్ ప్రమాదభరితంగా ఉంది. తీగలు జారిపోయి చేతికందే ఎత్తులో వేలాడుతూ పొలంలో పని చేసే క్రమంలో రైతులు, వ్యవసాయ కూలీలు పొరపాటున చేతులు పైకెత్తితే తగులుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళనలు చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఎల్‌టీ విద్యుత్‌లైన్‌ను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

### పరామర్శ



**కావలి:** దగదర్తి మండల సీనియర్ నాయకుడు తాళ్లూరు రమణయ్యనాయుడు మరణించిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించారు. దగదర్తిలోని తాళ్లూరు నివాసానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుమారులైన ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, రవి నాయుడుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### రాకపోకలెలా?



**కావలి:** పట్టణంలోని పాత మున్సిపల్ కూరగాయల మార్కెట్‌ను ఆనుకున్న ఉన్న చిన్న వీధిలో పలు రకాలు వ్యాపార సంస్థలు ఉన్నాయి. వాటికి సంబంధించిన వస్తువులను లోడింగ్..అన్‌లోడింగ్ చేసే క్రమంలో వాహనాలను గంటల తరబడి నిలిపివేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు.

### అధ్వానంగా అంతర్గత రోడ్లు



**జలదంకి:** మండలంలోని రామవరప్పాడు పంచాయతీలో అంతర్గత రోడ్లు దారుణంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. సీసీరోడ్లు నిర్మించాలని పంచాయతీ పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

# అయ్యప్ప మాలధారణ.. నియమాల తోరణం

- ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాల మేళవింపు
- దీక్షపై ఆసక్తి చూపుతున్న యువత
- ఏటా పెరుగుతున్న మాలధారులు



జలదంకిలో అయ్యప్ప పడి పూజోత్సవం నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

**జలదంకి/సోమశిల:** పవిత్ర కార్తీక మాసంలో ఎటు చూసినా ఆధ్యాత్మిక శోభ కనిపిస్తుంది. ఈ మాసం నుంచి అయ్యప్ప మాలధారుల కోలాహలం కనిపిస్తుంది. శివకేశవుల తనయుడైన మణికంఠుని దీక్ష ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాల మేళవింపు. అయ్య అంటే విష్ణువు. అప్ప అంటే శివుడు. ఇరువురి పేర్ల సంగమంతో అయ్యప్పనామం ఆవిర్భవించింది. మహిషా అనే రాక్షసుడిని సంహరించి అయ్యప్ప కేరళలోని శబరిమలైలో వెలిశాడు. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో శబరిమలై అయ్యప్ప ఆలయం ఒకటి. మనస్సు, శరీరాన్ని పవిత్రం చేసుకుని ఆధ్యాత్మిక చింతనతో తనను తాను మార్చుకునేందుకు 41 రోజుల అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుంది. మాలధారణ, నల్లని వస్త్రధారణ, చన్నీటి స్నానం, విభూది, చందనం, కుంకుమలతో అలంకరించుకోవడం వంటి ఆచారాలు ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. శరీరంపై బస్మధారణ ఈశ్వర సంకేతానికి, నుదుటిపై మెరిసే తిరునామం విష్ణుమూర్తిని గుర్తు చేస్తుంది. మోక్ష మార్గాన్ని అన్వేషించేవారు. సన్మార్గాన జీవనయాత్ర సాగించాలనుకునేవారు తప్పనిసరిగా తమ జీవితంలో ఒక్కసారైనా అయ్యప్ప దీక్ష చేపట్టి శబరిమలై యాత్ర చేపట్టాలని కోరుకుంటారు. అయ్యప్పదీక్ష చేపట్టి శబరిమలై ఆలయంలోని 18 మెట్లు అధిరోహించి మణికంఠుని దర్శించుకోవడం ద్వారా అజ్ఞానం తొలిగి స్వామి అనుగ్రహం లభిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఇటీవల కాలంలో మాలధారణ చేసేందుకు యువత అత్యధిక శాతం మంది ఆసక్తి చూపుతూ అయ్యప్ప దీక్షను స్వీకరిస్తున్నారు.

**నియమ నిబంధనలు**

అయ్యప్ప మాలధారణను ఆలయంలో గురుస్వాములు లేదా మాతృమూర్తి వద్ద స్వీకరిస్తారు. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు స్నానమాచరిస్తారు. ఇంట్లో పూజలు చేసుకుని, అయ్యప్పస్వామి ఆలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. అలాగే సూర్యాస్తమయం తర్వాత పూజలు నిర్వహించాల్సి ఉంటుంది. అయ్యప్పలు నల్లటి దుస్తులు ధరించి 41 రోజుల పాటు కఠిన నియమాలు పాటించి దీక్ష చేపడుతారు. అయ్యప్ప దీక్ష అంతా ఆధ్యాత్మిక పారవశ్యమే. దీక్ష చేపట్టిన నాటి నుంచి విరమించే వరకు స్వాములు అయ్యప్పస్వామి ధ్యానంలోనే ఉంటారు. ప్రతి ఒక్కరిని స్వామి అని పిలుస్తూ దీక్షా సమయంలో శాంతితో, సహృదయంతో మసులుకుంటూ ఉంటారు. దీక్ష చేపట్టిన 41 రోజుల తరువాత ఆలయాల్లో గురుస్వాములచే ఇరు ముడులు కట్టించుకుని శబరిమలైకు బయలుదేరుతారు. అక్కడి పంబా నదిలో స్నానమాచరించి అయ్యప్ప సన్నిధానానికి చేరుకుని స్వామిని దర్శించుకుంటారు.

**ఇరుముడి ప్రాధాన్యత**

అయ్యప్పస్వామిని నవవిధ సేవలతో కొలుస్తుంటారు. శ్రవణం, కీర్తనం, పాదసేవనం, అర్చనం, నమస్కారం, ధ్యానం, స్మృతం, ఆత్మ నివేదనలతో కొలుస్తుంటారు. అయ్యప్పదీక్షలో ఇరుముడికి ఎంతో ప్రాముఖ్య ఉంది. ఇందులో రెండు ముడులు ఉంటాయి. ముందున్న ముడిలో అయ్యప్ప స్వరూపమైన ముద్ర, కొబ్బరికాయ స్వామికి సమర్పించే వస్తువులను ఉంచుతారు. కొబ్బరికాయను నేతితో నింపుతారు. నెయ్యి జ్ఞానానికి ప్రతీకగా చెబుతారు. కొబ్బరికాయకు బిగించే తాడును వైరాగ్యానికి చిహ్నంగా భావించి మూతపెడుతారు. ఆపైన కాయకు ఆత్మ అనే లక్కతో సీలు వేస్తారు. జ్ఞానం అనే నెయ్యితోనే అయ్యప్పకు అభిషేకం చేస్తారు. మనలోని జ్ఞానాన్ని సంపూర్ణంగా స్వామి అయ్యప్పకు నిండు మనస్సుతో అర్పించుకున్నట్లుగా భావించడమే అర్థం. దీన్నే ఆత్మనివేదన అంటారు.



జలదంకిలో భజనలు చేస్తున్న అయ్యప్పస్వాములు

**ఆరోగ్య ప్రయోజనాలు**

41 రోజుల అయ్యప్పదీక్ష ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సైతం దోహదపడుతుంది. భక్తిభావంతో పాటు ఆరోగ్య అలవాట్లలో కూడా మార్పు వస్తుంది. వేకువజామునే నిద్రలేవడం, చన్నీటి స్నానం ఆచరించడంతో నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. నేల మీద పడుకోవడం కండరాల పటిష్టతకు దోహదపడుతుంది. నిత్య దీపారాధన చేయడం వలన మనసు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. అయ్యప్పలు కార్తీక మాసం మొదటి రోజు నుంచి మకర సంక్రాంతి వరకు నిత్యం భజనలు చేస్తూ స్వామి వారికి పడి పూజోత్సవాలు నిర్వహిస్తూ అన్నప్రసాద వితరణ చేస్తూ స్వామి వారి కృపకు పాత్రులవుతారు.

**ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది**



అయ్యప్ప మాలధారణతో ఆధ్యాత్మిక చింతన పెరిగి భగవన్నామస్మరణలో నిమగ్నమవుతాం. 41 రోజుల దీక్ష తరువాత ప్రవర్తనలో ఎంతో మార్పు వస్తుంది. మానవతా విలువలు పెరగడంతో పాటు ఇతరులకు సాయం చేయాలనే తలంపు, శాంతి, తదితర లక్షణాలు అలవడతాయి. దైవారాధనతో జీవితం సాఫల్యం అవుతుంది. పాపాలు తొలగిపోయి సన్మార్గం వైపు నడుస్తాం.

–వాకా మాధవరెడ్డి, గురుస్వామి, జలదంకి

**భక్తితో పాటు ఆరోగ్యం**



అయ్యప్ప మాలధారణతో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. 41 రోజుల దీక్షతో ఆరోగ్యం మెరుగుపడుతుంది. తొలిసారి మాల ధరించిన వారిని కన్నెస్వామిగా పిలుస్తారు. వారిని సాక్షాత్తు అయ్యప్పస్వామిగా భావిస్తాం. అయ్యప్ప మాలధారులు కఠిన నియమాలతో దీక్ష చేపడితే ఖచ్చితంగా అయ్యప్పస్వామి అనుగ్రహం లభిస్తుంది.

–బట్రెడ్డి పోలిరెడ్డి, గురుస్వామి, అనంతసాగరం

**మంచి కలుగుతుందనే నమ్మకంతో..**



అయ్యప్ప మాలధారణ చేయడం వల్ల మంచి జరుగుతుందనే నమ్మకంతో పెద్దల ప్రోత్సాహంతో తొలిసారి మాలధారణ చేశాను. నిత్యం పూజలు చేయడం వల్ల ఆధ్యాత్మిక చింతన పెరిగి మనసుకు సంతోషాన్ని కలిగిస్తోంది.

– సాయి, కన్నెస్వామి, అనంతసాగరం

# వర్షంతో ద్విచక్ర వాహనదారుల అవస్థ

**ఆత్మకూరురూరల్:** మండలంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా వర్షం పడడంతో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై ఉన్న బస్‌షెల్టర్లలో తలదాచుకున్నారు.

**చేజర్లలో ఓ మోస్తరు వర్షం**

**చేజర్ల:** మండలంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై కొన్ని గ్రామాల్లో వర్షం పడింది. వర్షంతో రైతులు వరి నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 69.922 టీఎంసీలు ఉండడంతో రబీ సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




నారంపేట పారిశ్రామికవాడ సమీపంలోని బస్‌షెల్టర్‌లో తలదాచుకున్న ప్రయాణికులు

# మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి



సీతారామపురంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



వరికుంటపాడులో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



వింజమూరులో మాట్లాడుతున్న చలపతిశర్మ

**ఉదయగిరి:** ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించి 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం 117 జీఓను వెంటనే రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరారు. ఉపాధ్యాయులపై ఉన్న యాప్‌ల భారాన్ని తొలగించాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్‌కే కరీముల్లా, అధ్యక్షుడిగా వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే మహ్మద్ హనీఫ్ ఎన్నికయ్యారు. తొలుత ఉర్దూ విభాగంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఎస్‌కే సంధానిబేగం, ఎస్‌కే సబిహ సుల్తాన్‌బేగం, జిల్లా అవార్డుగ్రహీత ఎస్‌కే ఖాదర్‌బాషాను ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ ప్రతినిధులు నాయబ్‌బాషా, కే చంద్రోఖర్‌రెడ్డి, అంజాద్, గౌస్‌బాషా, ఏడుకొండలు, జాఫర్, రజియా, తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ నిరంతర పోరాటం**

**వరికుంటపాడు:** ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ పేర్కొన్నారు. వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వ హించిన యూటీఎఫ్ మండల సభలో ఆయన మాట్లాడారు. యూటీఎఫ్ ఆవిర్భవించి ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకొంటున్నట్లు తెలిపారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్ నారాయణ, వీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రతినిధి నాగార్జున, నాయకులు సుబ్బారావు, కరీముల్లా, హరిచంద్రప్రసాద్, కాంతారావు, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

**సీతారామపురం:** యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీతారామపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ మండల సభలో మండల గౌరవాధ్యక్షుడిగా షేక్ రంతుజాని, అధ్యక్షుడిగా బోగ్యం శ్రీనివాసులు, సహాధ్యక్షులుగా సురేష్, పీఏపీ కుమారిని ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా గొడ్లవీటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా నరసింహ రాజు, మహిళా కార్యదర్శిగా పార్వతి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శిగా మహేష్, ఆడిటర్‌గా ఆనందీశ్వరయ్య, జిల్లా కార్యదర్శిగా షేక్ షబ్బీర్, జిల్లా కౌన్సిలర్లుగా డీ వెంకటేశ్వరరెడ్డి, పేరాల శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

## ఆశీర్వచనం



ప్రసన్నసాయి, అచ్యుతను ఆశీర్వదిస్తున్న కాకాణి, రామిరెడ్డి

**అల్లూరు:** నెల్లూరులో ఆదివారం జరిగిన అల్లూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలం సాయి కుమార్ కుమారుడు నీలం ప్రసన్నసాయి వివాహ వేడుకకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులు ప్రసన్న సాయి, అచ్యుతను ఆశీర్వదించారు.

**ఉదయగిరి:** ఉదయగిరి మండల మాజీ అధ్యక్షుడు చేజర్ల సుబ్బారెడ్డి రెండో కుమారుడు సురేష్‌రెడ్డి వివాహ వేడుక ఆదివారం జరిగింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డి, దుగ్గిరెడ్డి గురవారెడ్డి, అల్లూరురాజు, పావులూరి మాల్యాద్రిరెడ్డి, పాముల రమణయ్య, చెంచలబాబుయాదవ్, మోది రామాంజనేయులు, తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## ల్యాబ్ భవనం ప్రారంభమెన్నడో?



**దుత్తలూరు:** స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో నూతనంగా ల్యాబ్ భవనాన్ని నిర్మించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీ అభివృద్ధిలో భాగంగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు లక్షలాది రూపాయల సామగ్రిని సమకూర్చారు. అందుకుగాను ల్యాబ్ కోసం నూతన భవనాన్ని మంజూరు చేశారు. కొత్త భవన నిర్మాణం పూర్తయినప్పటికీ నూతన ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రారంభించలేదు. అధికారులు స్పందించి వెంటనే నూతన భవనాన్ని ప్రారంభించి ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



సోమశిల: కవుల గురించి వివరిస్తున్న పెంచలయ్య



వింజమూరులో చిన్నారుల పుస్తక పఠనం

**వింజమూరు(ఉదయగిరి):** గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ఉపాధ్యాయుడు చీమల మాల్యాద్రి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వింజమూరు గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. పుస్తక పఠనాన్ని దినచర్యగా అలవర్చుకుంటే విజ్ఞానం పెంపొందుతుందన్నారు.వ్యక్తిత్వ వికాసం మెరుగుపడుతుందన్నారు. ఆ దిశగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. గ్రంథాలయాధికారి జ్యోతికొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

**పద్యం తెలుగువారి సొంతం**

**సోమశిల:** తెలుగు సాహిత్య ప్రక్రియలో ఒకటైన పద్యం ఇతర భాషల్లో లేదని, ఇది కేవలం తెలుగువారికే సొంతమని జనవిజ్ఞాన వేదిక నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు వేము పెంచలయ్య పేర్కొన్నారు. అనంతసాగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ నారాయణరావు ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహాభారతాన్ని తెలుగులో అనువదించిన నన్నయ్య, తిక్కన, ఎర్రన, మహాభారతాన్ని రాసిన పోతన, రామాయణం రచించిన వాల్మీకి, ప్రాచీన, ఆధునిక కవుల గురించి విద్యార్థులకు వివరించారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ బీ మురళి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ అభివృద్ధికి కృషి

- తలసేమియా డే కేర్ సెంటర్ ప్రారంభం
- కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి



తలసేమియా డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

**కావలి:** రెడ్‌క్రాస్ కావలి శాఖ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన తలసేమియా డే కేర్ సెంటర్‌తో పాటు ఆధునీకరించిన రక్తనిధి కేంద్రాన్ని రాష్ట్ర రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీధర్‌రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డితో కలిసి ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం తలసేమియా బాధిత చిన్నారులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా పన్నెండు రకాల సేవలు అందించడం అభినందనీయమన్నారు. కావలి శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు చేయూతనందించి అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, రవిప్రకాష్, రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల బెడదను తొలగించేందుకు చర్యలు




మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

**కావలి:** పల్లెల్లో తీవ్రంగా ఉన్న కుక్కల బెడదను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ సీహెచ్ శ్రీదేవి తెలిపారు. కావలి మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఆలూరి కొండమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తొలుత మండలాధికారులు శాఖల వారీగా మండలంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పెద్దపట్టపుపాళేనికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపీటీసీ గంగనగారి యాదగిరి కోరగా ఆర్టీసీ డీఎంతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి ఎస్ మల్లారెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. పల్లెల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటి బెడదను తొలగించేందుకు సంతానోత్పత్తి కలగకుండా ఆపరేషన్లు చేయడంతో పాటు యాంటీ రేబిస్ టీకాలు వేయాలని పశు సంవర్థక శాఖ వైద్యుడు నాయక్‌కు సూచించారు. స్పందించిన డాక్టర్ నాయక్ మాట్లాడుతూ కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. తగిన వసతులు కల్పిస్తే కుక్కలకు సంతాన ఉత్పత్తి కలగకుండా ఆపరేషన్లు చేస్తామని పేర్కొన్నారు. అందుకు ఎంపీడీఓ స్పందిస్తూ మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి కుక్కలకు ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఆధార్‌ను నవీకరించుకోకుంటే తిప్పలే

- పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలన్న యూఐడీఏఐ
- డిసెంబర్ 14 వరకు ఉచిత సేవలకు అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ సేవలు పొందేందుకు ఇబ్బందులు

**కావలి:** మన దేశంలో పుట్టిన పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు ప్రతివ్యక్తికి కూడా ఆధార్ కార్డు తప్పనిసరి. ప్రజల గుర్తింపునకు సంబంధించిన అతిముఖ్యమైన డాక్యుమెంట్‌లలో ఇది ఒకటి. పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, తదితరాలతో పాటు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఆధార్ కార్డు ఖచ్చితంగా ఉండాల్సిందే. అయితే ఆధార్ కార్డు పొందిన ప్రతిఒక్కరూ పదేళ్లకోసారి గుర్తింపు కార్డు, అడ్రస్ ప్రూఫ్‌ను సమర్పించి సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రిపాజిటరీ (సీఐడీఆర్)లోని వివరాలు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సేవలను ఉచితంగా కల్పిస్తూ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) వెసులుబాటు కల్పించింది. అయితే ప్రతిఒక్కరికీ ఆధార్ ఉండాలని, పదేళ్ల క్రితం తీసుకున్నవారు వాటిని నవీకరించుకోవాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా చాలా మంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. తీరా అవసరమైనప్పుడు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను పొందేందుకు ఆధార్ తప్పనిసరి. ఆధార్‌లో సాంకేతిక తప్పిదాలుంటే అర్హులు సైతం సంక్షేమ ఫలాలకు దూరమయ్యే అవకాశముంది. ఆధార్‌లో పొరపాట్లు ఉంటే ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం విద్యార్థులకు అపార్ నమోదు ప్రక్రియ చేపడుతున్నారు. కొందరు విద్యార్థుల ఆధార్, పాఠశాల రికార్డుల్లో నమోదైన వివరాలు సరిపోలక పోవడంతో అపార్ నమోదు సాధ్యం కావడం లేదు. దీంతో అత్యవసరంగా ఆధార్‌లో సవరణలు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ విద్యార్థులందరికీ అపార్ నమోదును తప్పనిసరి చేయడంతో జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియను చేపడుతున్నారు. దీంతో ఆధార్ నమోదు కేంద్రాలు విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి.

**డిసెంబరు 14 వరకు అవకాశం**

ప్రభుత్వం ఆధార్‌కు సంబంధించిన సేవలను ప్రజలకు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 153 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోతుండడంతో ఆధార్ అప్‌డేట్‌కు ప్రజలు నిరంతరం సమస్యలను ఎదుర్కొంటున్నారు. అయితే ఈ సమస్య నుంచి బయటపడేందుకు పోస్టాఫీసుల్లో కూడా ఆధార్ సంబంధిత సేవలను పొందవచ్చని ఇండియా పోస్ట్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆధార్ వివరాలను పదేళ్లకోసారి అప్డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ గతంలో ప్రకటించింది. అప్పట్నుంచి పలుమార్లు గడువు పొడిగిస్తూ వస్తోంది. ఆధార్ ఉచిత అప్డేట్ గడువును ఈ ఏడాది చివరి వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 14వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందని పేర్కొంది. ఇప్పటి వరకు అప్డేట్ చేసుకోని వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించింది. అంతేకాదు ఆధార్ కార్డులో చిన్నచిన్న మార్పులు చేసుకోవాల్సిన వారు కూడా చేసుకోవచ్చు. అయితే ఏ మార్పు చేసుకోవాలని అనుకుంటున్నారో.. అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కార్డుదారు పేరు, పుట్టినతేదీ, చిరునామా వంటి అంశాల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు.

**ప్రత్యేక ఆధార్ క్యాంపులు**

రాష్ట్రంలోని గిరిజనులు, చిన్నారులు, అనాథల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గిరిజన ప్రాంతాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అనాథ శరణాలయాల్లో ఈ నెల 19 నుంచి 22 వరకు, మళ్లీ ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు క్యాంపులను నిర్వహించాలని సూచించింది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేపట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించింది.

# ప్రమాదభరితంగా ఓవర్‌హెడ్ ట్యాంకు



**సీతారామపురం:** స్థానిక సినిమాహాల్ సెంటర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రమాదభరితంగా ఉంది. ఈ ట్యాంకును సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించారు. గత పదహారేళ్లుగా వినియోగించడం లేదు. ప్రస్తుతం ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. ట్యాంకు చుట్టూ జనావాసాలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జనావాసాలపై పడి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకముందే సంబంధిత అధికారులు స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంకును కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.